17వ
నేటి దినపత్రిక
సూర్య
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం,29 జనవరి 2024


## రావులపాలెంలో తెలుగుదేశం పార్టీలో చేరికల జోరు

**– టీడీపీ తీర్థం పుచ్చుకున్న మాజీ యంపీటీసీ రామకృష్ణ ఆద్వర్యంలో పలువురు చేరిక**



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** రావులపాలెం గ్రామానికి చెందిన మాజీ యంపీటీసీ కొండేపూడి రామకృష్ణ వైసీపీ పార్టీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్న విషయం విదితమే. ఆయన ఆధ్వర్యంలో ఆదివారం రావులపాలెం నందు రామకృష్ణ అనుచరులు పలువురు టీడీపీ పార్టీలోనికి చేరారు. వారికి రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు, కొత్తపేట నియోజకవర్గ ఇంచార్జీ బండారు సత్యానందరావు పార్టీ కండువాలు కప్పి సాధరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి దళిత ద్రోహని, అనేక దళిత పథకాలను రద్దు చేశాడని, సబ్ ప్లాన్ నిధులు మళ్లించి దళితులకు తీరని ద్రోహం చేశాడని, మళ్లీ దళితులకు గర్వంగా తలెత్తుకొనే జీవించాలంటే తెలుగుదేశం పార్టీ అధికారం లోకి రావాలని అన్నారు. దళితులను అత్యున్నత స్థానంలో కూర్చోబెట్టిన ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వమని, బలయోగిని లోక్‌సభ స్పీకర్ పదవితో, ప్రతిభాభారతిని అసెంబ్లీ స్పీకర్ పదవితో గౌరవించిన చరిత్ర తెలుగుదేశం పార్టీదని గుర్తు చేశారు. పార్టీలో చేరిన ప్రతిఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని సత్యానందరావు అన్నారు.కొండేపూడి రామకృష్ణ, కొండేపూడి ప్రసన్న, మల్లిడి వేణురెడ్డి, రక్షణరాజు, అంబటి వెంకటేశ్వరరావు, కొండేటి చిన్న, వార చిట్టిబాబు, రాజేష్ వర్మ, కొండేపూడి శేఖర్, కె.భరత్ శ్రీను, వీరవల్లి సురేష్, కర్రి రమేష్, ఎం.మోహనరావు, కదలి సత్యనారాయణ, కదలి నాగలక్ష్మి, కదలి గంగాభవాని, పాము సునీల్ టిడిపి పార్టీలో చేరారు.

# కొల్లగొట్టేయ్.. జేబులు నింపుకో

**– యదేచ్ఛగా పోలవరం కాలువ మట్టి త్రవ్వకాలు..**

**– పట్టించుకోని అధికారులు**











**కాకినాడ,మేజర్‌న్యూస్ ప్రతినిధి :** ఎక్కడ మట్టి కనపడినా కొల్లగొట్టి జేబులు నింపుకో అన్న చందంగా తయారయ్యారునాయకులు. కొండలను సైతంకొల్ల గొడుతున్నారు.అంతటితో ఆగకుండా జగ్గంపేట నియోజకవర్గంలోని కొండలుగా వేసిన పోలవరం కాలువ మట్టిని అక్రమార్కులు రాత్రి సమయాల్లో యదేచ్ఛగా తరలిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి మండలాల్లో పోలవరం కాలువ త్రవ్విన మట్టిని పెద్ద, పెద్ద కోండలుగా వేశారు. ఆ మట్టి ఎవరికైనా కావాలంటే అనుమతులు కోసం ఇరిగేషన్ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. అలా దరఖాస్తు చేసుకున్న వారికి క్యూబిక్ మీటర్ల లెక్కల్లో ప్రభుత్వానికి రుసుములు చెల్లించాలి. కానీ అవేమీ లేకుండానే రాత్రి సమయాల్లో గత కొన్ని రోజులుగా మట్టిని తరలిస్తున్నారు.కిర్లంపూడిమండలం బురుగుపుడి గ్రామ పోలవరం ప్రాజెక్టు డివిజన్, 3 పరిధి నుండి యధేచ్ఛగా తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. బూరుగుపుడి శివారు ఎవరూ వెళ్ళలేని ప్రాంతం నుండి మట్టిని లారిలతో తరలించి గండేపల్లి మండలం జెడ్.రాగంపేట పంట పొలాలను నింపుతున్నారు. గ్రామానికి చెందిన ఉపాథిహామీ ఫీల్డ్‌అసిస్టెంట్‌అర్ధరాత్రిసమయాల్లో ఈ వ్యవహారాన్ని కొనసాగిస్తున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. భారీ మిషన్లతో లోడు చేసి టిప్పర్ లారీలతో తరలిస్తున్నారని, ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాల్సిన అధికారులు కాసులకు కక్కుర్తి పడుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ శాఖలో పనిచేస్తూ ఆ శాఖ అధికారుల ప్రోత్సాహంతో రాత్రి సమయాల్లో మట్టిని అమ్ముకునిజేబులునింపుకుంటున్నారనిపలువురు పేర్కొంటున్నారు. ఐతే ఈ విషయంపై ఇరిగేషన్ అధికారులకు అందిన పిర్యాధు మేరకు పోలవరం ప్రాజెక్టు ఈఈ డి.శ్రీనివాసులు అదేశాలు మేరకు జెఈ ప్రసాదరాజు బూరుగుపుడిలో త్రవ్వకాలు చేసిన ప్రదేశాన్ని ఒకరోజు పరిశీలించారు. అలానే మట్టి నింపిన స్థలాన్ని పరిశీలించి లెక్కలు వేశారు. పరిశీలించిన నివేదికలను ఈఈ శ్రీనివాసులును అడగాలన్నారు. ఈఈ ని వివరణ కోరేందుకు వెళ్లినా ఆయన అందుబాటులో లేరు. ఇక గోకవరం రోడ్డులోని సబ్ డివిజన్ 2 కార్యాలయం వద్దకు వివరణ కోసం వెళితే అక్కడ తాళాలు దర్శనమిచ్చాయి. కార్యాలయం బోర్డుపై ఉన్న ఫోన్ నెంబర్లుకు ఫోన్ చేస్తే అవి పని చేయడం లేదు. ఆలా అధికారులు ఈ వ్యవహారంపై తప్పించుకునే ధోరణిలో ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జలవనరుల శాఖ జిల్లా అధికారులు, జిల్లా కలెక్టరు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఏటిమొగలో జనసేన 'యుద్ధానికి మేము సిద్ధం'



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ సిటిలో జనసెనపార్టీ పి.ఏ.సిస్ సభ్యులు మరియు కాకినాడ సిటి ఇంచార్జ్ ముత్తా శశిధర్ నాయకత్వంలో యుద్ధానికి మేము సిద్ధం అనే కార్యక్రమం స్థానిక ఏటిమొగ ప్రాంతంలో బర్రె అప్పారావు ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముత్తా శశిధర్ మాట్లాడుతూ నోటికి వచ్చిన మాటలతో వాగ్ధానాలు చేసి అధికారం చేపట్టిన ఈ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీరా అధికారంలో చేసిన వచ్చాకా వాగ్ధానాలను తుంగలోకి తొక్కి ప్రజావ్యతిరేక పాలన చేసి ఇప్పుడు కొత్తగా మేము సిద్ధం అని సభలు పెట్టడం చాలా హాస్యాస్పదంగా ఉందని అంటూ తన మాటల్లోనే తన ఓటమిని జగన్మోహన రెడ్డి ఒప్పేసుకున్నాడని వ్యాఖ్యానించారు. ఇప్పుడు కొత్తగా కులగణన అని అంటూ కొత్త కుయుక్తులు, పన్నాగాలు పన్నడానికి ప్రయత్నాలు ఈ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తెరలేపుతున్నాడనీ జనసేన పార్టీ వీటన్నింటినీ ఎదుర్కొనడానికి సిద్ధం అని తెలియచేస్తున్నామని అంటూ "అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పునరుద్ధరించడానికి యుద్ధానికి మేము సిద్ధం", "భయం-కబ్జాలు లేని కాకినాడ కోసం యుద్ధానికి మేము సిద్ధం", "మన బంగారు భవిష్యత్ కోసం – శాంతి భద్రతల కోసం యుద్ధానికి మేము సిద్ధం" అని నినందించారు. దుర్మార్గపాలనతో, అణిచివేత చర్యలతో, అవినీతితో ఈ ఐదుఏండ్లు పాలన చేసి అసలు ఏ ముఖం పెట్టుకుని వై.సి.పి. పార్టీ ప్రజల వద్దకి ఓటు వేయమని వస్తుందో చెప్పాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకుండా జనసేనపార్టీ, తెలుగుదేశం పార్టీలు ఉమ్మడిగా వస్తున్నామనీ, వై.సి.పి. దౌర్జన్యాలకి చరమగీతం పాడి కొత్త ప్రజాసంక్షేమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని తెలియచేసారు. రాబోయే ఎన్నికల యుద్ధానికి సిద్ధమని, ప్రజలే న్యాయ నిర్ణేతలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాసిరెడ్డి శివ, జిల్లా కార్యదర్శి అట్ల సత్యనారాయణ, జనసేన నాయకులు దుగ్గన బాబ్జి, ఆకుల శ్రీను, మడ్డు విజయ్, అగ్రహారం సతీష్, శ్రీరాం చక్రవర్తి, గోవిందరావు, వాసంశెట్టి శ్రీను, మోహన్, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

## అక్షయ సేవా సంస్థ రూ.23 వేలు చేయూత



**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** కొత్తపేట మండలం చినరాముడు నూతిమరక గ్రామానికి చెందిన యనమదాల కృష్ణ ఇల్లు కరెంట్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా దగ్ధమైంది. శనివారం రావులపాలెం అక్షయ సేవా సంస్థని సహాయం కోరగా.. సంస్థ నుండి రూ.10,000 మరియు సంస్థ సభ్యులు పి.పురుషోత్తం రూ.2 వేలు, గుడిమెట్ల వెంకట కృష్ణారెడ్డి రూ.2 వేలు, ఉండమట్ల నాగలక్ష్మి రూ.2 వేలు, కోట సూర్య కుమారి వెయ్యి రూపాయలు, కే.సంజయ్ రెడ్డి రూ.1000, కొండ్రెడ్డి వీర వెంకట సత్యనారాయణ రూ.10 00, లంకె వెంకటేశ్వర్లు రూ.1000, కామగళ్ల మల్లేశం రూ.500, బొక్క శ్రీనివాస్ రూ.500, దూలం విజయ రూ.500, ధర్మాడి ఆదిలక్ష్మి రూ.500, వి.లలిత రూ.500, దండుప్రోలు ఆదినారా యణ రూ.500 మొత్తం 23 వేల రూపాయలు కృష్ణ కుటుంబ సభ్యులకు అక్షయ సేవా సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో అందించారు.

## సమాచార హక్కు చట్టం-2005పై అవగాహన సదస్సు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** శ్రీ నూకాలమ్మ అంకాలమ్మ అమ్మవారి కల్యాణ మండపం నందు సమాచార హక్కు చట్ట న్యాయ పోరాట సమన్వయ కమిటీవారు నిర్వహిస్తున్న జాతీయస్థాయి కార్యవర్గ సమావేశంలో సమాచార హక్కు చట్టం -2005 పై అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సదస్సులో జాతీయ, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయిలో సమాచార హక్కు చట్టం గురించి అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని, అవినీతి లేని సమాజాన్ని ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ పథకాలు ప్రజల వద్దకు చేరాలని, పోలీసులకు-ప్రజలకు మధ్య సమాచార హక్కు చట్ట న్యాయ పోరాట సమన్వయ కమిటీ ఒక వారధిగా ఉంటుందని, దేశానికి వెన్నెముకైన రైతులకు చట్టపరమైన పథకాలు అందే విధంగా సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న అకృత్యాలు ప్రాలద్రోలే విధంగా సమాచార హక్కు చట్ట న్యాయ పోరాట సమన్వయ కమిటీ కృషి చేస్తుందనీ, ప్రభుత్వ-ప్రైవేటు సంస్థలలో అవినీతిని నిర్మూలించడానికి కృషి చేస్తున్నాము, చేస్తాము. అవినీతి అధికారులు ఎవరైనా సరే సమాచార హక్కు చట్ట సమన్వయ కమిటీ దృష్టిలో పడితే ఫలితం వేరేలా ఉంటుందనీ సమాచార హక్కు చట్ట న్యాయ పోరాట సమన్వయ కమిటీ చైర్మన్ & ఫౌండర్ సురేష్ కంచర్ల మరియు జాతీయ అధ్యక్షులు బాలాజీ శంకర్ సింగ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గంటా అప్పారావు నేషనల్ సెక్రటరీ, కవి రచయిత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి సురేష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు మునిగేటి కాశి, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భట్టు సంతోష్ తోలా నాయక్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బండి ప్రభాకర్, నేషనల్ మీడియా కో-ఆర్డినేటర్ హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్ కే.బాలాజీ సింగ్, లీగల్ డిపార్ట్‌మెంట్ వెంకటేశ్వర్లు, అలాగే 10మంది నేషనల్ మరియు స్టేట్ కమిటీ సభ్యులు అభిషిక్త్ రోజ్, కాకినాడ జిల్లా అధ్యక్షుడు పాల్గొన్నారు.

## గ్రంధాలయంలో విద్యార్ధులకు కథలపై అవగాహన



**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం ప్రధమ శ్రేణి శాఖ గ్రంధాల యంలో గ్రంధాలయాధి కారి పాలంకి నాగరాజు ఆధ్వర్యంలో సండే స్టోరి టైమ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం విద్యా ర్థులకు కథలు చెప్పడం, పుస్తకాలు చదివించడం, అలాగే కథల యొక్క విశిష్టతను తెలియజేయడం, వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానొపాధ్యాయులు ఆర్.వెంకటేశ్వరరావు విద్యార్థులకు చదవు యొక్క ఆవశ్యకతపై వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సిబ్బంది సింగం బుల్లియ్య, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జగన్ రెడ్డిని ఓడించేందుకు జనం సిద్ధం

**– ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమంలో వనమాడి**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** అవినీతి, అరాచకం, దోపిడీ, విధ్వంసంతో కూడిన పాలన చేస్తున్న జగన్ రెడ్డి ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు ఆంధ్ర రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని కాకినాడ సిటీ మాజీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ఓటర్ వెరిఫికేషన్, భవిష్యత్తు గ్యారెంటీ, మై టిడిపి తదితర అంశాలపై కాకినాడ స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయము నందు ఆదివారం క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లకు కాకినాడ సిటీ నియోజకవర్గ ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ జగన్ రెడ్డి అహంకారానికి, వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనకు స్వస్తి పలికేందుకు రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు అందరూ సిద్ధంగా ఉన్నారని, వైసిపి ప్రభుత్వ అరాచక విధ్వంసక పాలన వల్ల రాష్ట్రం ఎంతో నష్టపోయిందని, వైసిపి అరాచక పాలన నుండి రాష్ట్రాన్ని కాపాడవలసిన బాధ్యత నేడు ప్రతి ఒక్కరిపై ఉందని, జగన్ రెడ్డి అసమర్థత పాలన వల్ల రాష్ట్ర అప్పులు పెరిగి వాటికి వడ్డీలు బారీగా పెరిగి ఆ భారం ప్రజలపై పడుతుందని, నిత్యవసర వస్తువుల ధరలు, ఇంటి పన్నులు, విద్యుత్ చార్జీలు, బస్ చార్జీలు, 5 రెట్లు పెంచి, చెత్త పన్నులు లాంటివి వేసి రాష్ట్ర ప్రజల రక్తాన్ని జగన్ రెడ్డి జలగలా పీల్చుస్తున్నాడని, ఈ ఐదేళ్ల కాలంలో జగన్ రెడ్డి ఆంధ్ర రాష్ట్రానికి ఒక్క పరిశ్రమను, ప్రాజెక్టును తీసుకు రాకపోగా, ఉన్న పరిశ్రమలను జె.టాక్స్ లతో బెదిరించి ఇతర రాష్ట్రాలకు తరిమేసి రాష్ట్ర యువతను నిరుద్యోగపాలు చేశాడని, ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని జగన్ రెడ్డి ఇప్పుడు చెబుతున్నాడని, కానీ ఆంధ్ర రాష్ట్ర ప్రజలు వైసిపి పార్టీని ఓడించేందుకు తాము సిద్ధమని ఎప్పుడో చెప్పారని, జగన్ రెడ్డికి కౌంట్‌డౌన్ మొదలైందని, ఆంధ్ర రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అవలంభిస్తున్న అరాచక విధ్వంసకర పాలనను ప్రతి కుటుంబానికి వివరించి, తెదేపా-జనసేనను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, ఇంటిగ్రేటెడ్ శిక్షణ పరిశీలకులుయు.శివశంకర్, ఎస్.వి.సత్య నారాయణ, సాంబశివరావు, కశింకోట చంద్రశేఖర్, తుమ్మల రమేష్, ఎస్.కె. రహీమ్, పలివెల రవి, ఎం.ఎ. తాజుద్దీన్, పంతాడి రాజు, సీకోటి అప్పలకొండ, తుమ్మల సునీత,మీసాలసునీత, బంగారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ధర్నా చౌక్‌పై సత్వర నిర్ణయం తీసుకోవాలి - బిజెపి డిమాండ్



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** ధర్నా చౌక్ పై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని లేదారాజకీయపార్టీలు ప్రజా సంఘాలు కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసేందుకు అనుమతించాలని కోరుతూ గత మూడు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న దుసర్లపూడి రమణరాజును భారతీయ జనతాపార్టీ రాష్ట్ర నాయకులు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, మీడియా ప్యానలిస్ట్ దువ్వూరి సుబ్రహ్మణ్యం, కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కిలిగడ్డ గంగరాజు సందర్శించిఆయనకుమద్దతు తెలియజేశారు. కలెక్టర్ కార్యాలయం ముందు గతంలో రాజకీయ పార్టీలు ధర్నాల నిర్వహించి కలెక్టర్ లేదా జాయింట్ కలెక్టర్ వంటి ఉన్నతాధికారులకు వినతి పత్రాలు సమర్పించే వారని, ఇప్పుడు అధికారులు ఒకచోట ధర్నా చౌక్ పేరుతో ఏర్పాటు చేసిన ప్రాంతం మరొకచోట ఉండడంతో వినతిపత్రం ఇచ్చేందుకు రాజకీయ పార్టీ ప్రతినిధులు ప్రజా సంఘాలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నాయని, పైగా ధర్నా చౌక్ ప్రాంతంలో కనీస వసతులు లేవని బిజెపి నాయకులు ఈ సందర్భంగా ఆరోపించారు. ఇటీవల కాలంలో అంగన్వాడీ కార్యకర్తలు, సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు, మున్సిపల్ ఉద్యోగులు మహిళలతో సహా ఉద్యమాలు నిర్వహించారని, ఈ పరిస్థితుల్లో ధర్నా చౌక్ సమీపంలో కనీసం మరుగుదొడ్ల సౌకర్యంలేక మహిళాఉద్యోగులుచాలా ఇబ్బందులకు గురయ్యారని అనునిత్యం రాజకీయ పార్టీ మహిళా కార్యకర్తలు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారని ప్రభుత్వ తీరుని తీవ్రంగా బిజెపి రాష్ట్ర నాయకులు ఎనిమిరెడ్డి మాలకొండయ్య ధూయబట్టారు. ధర్నా చౌక్ వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయడం అంటే అధికారులకి ప్రజలకి ఈ మధ్య విభజన గీత గీయడం అని ప్రజలను అధికారులకు చేరువ చేయడం ప్రజాస్వామ్య లక్షణం ఈ సందర్భంగా మాట్లాడిన మాలకొండయ్య వ్యాఖ్యానించారు. ధర్నా చౌకను వేరే ప్రాంతంలో ఏర్పాటు చేసే ముందు కనీసం రాజకీయ పార్టీలను సంప్రదించిన దాఖలాలు లేవని, ఒకరు లేదా ఇద్దరు తమకు అనుకూలమైన వ్యక్తులతో సమావేశం నిర్వహించి కలెక్టరేట్ నుంచి ధర్నాచౌక్ ను మార్చడం జరిగిందని, ఈ సందర్భంగా మాట్లాడిన దువ్వూరి సుబ్రహ్మణ్యం ఆరోపించారు. ధర్నా చౌక్ పిలవబడుతున్న ప్రాంతంలో ప్రతిరోజు శానిటేషన్ మైంటైన్ చేయాలని, పార్కు కొన్న గోడను తొలగించి కాలవకు ధర్నా చౌక్ మధ్యలో ప్రమాదాలు నివారించే విధంగా గోడ నిర్మాణం చేయాలని, అదే విధంగా ఒక పోలీస్ అవుట్ పోస్టును ధర్నాచౌక్ వద్ద ఏర్పాటు చేయాలని, అదేవిధంగా వినతిపత్రాలను సంబంధిత ఉన్నతాధికారులకు అందజేసే విధంగా ఒక ఇన్చార్జ్ అధికారిని ధర్నా చౌక్ లో నిరంతరం ఉంచాలని, ధర్నా చౌక్ ప్రాంతంలో బాత్రూంలో వంటి సౌకర్యం కల్పించి నీరువంటి వాటిని ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలని లేదా తక్షణం ధర్నా చేసేందుకు కలెక్టరేట్ దగ్గర రాజకీయ పార్టీలను ప్రజా సంఘాలను అనుమతించాలనిదువ్వూరిసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కొక్కిలిగడ్డగంగరాజుమాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నిరసన తెలపటం ప్రజల హక్కుని ఈ ప్రభుత్వం వచ్చిన నాటి నుండి ప్రజా హక్కులను తుంగలో తొక్కుతోందని ఆరోపించారు ధర్నా చౌక్‌కు సంబంధించి అవసరమైతే తాము కలెక్టర్‌ను కలవగలమనిఈ సందర్భంగా కొక్కిలిగడ్డ గంగరాజు ప్రకటించారు.

## జగన్‌కు ఓటమి భయం పట్టుకుంది

**– జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ బాబా**



**కాకినాడరూరల్,మేజర్ న్యూస్ :** జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని అందుకే బేలగా మాట్లాడుతున్నాడని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా అన్నారు. మండల పరిధిలోని రేపూరు గ్రామంలో ఆదివారం ఆయన ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్ళి సూపర్-6 పథకాల బ్రోచర్లను అందజేశారు. శ్రీనివాస్ బాబా మాట్లాడుతూ ప్రజాసంక్షేమం, మహిళా అభ్యదయం టీడీపీతోనే సాధ్యమన్నారు. జగన్ రెడ్డిని ఓడించేందుకు జనం సిద్ధమని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నక్క శ్రీనివాసరావు మరియు టీడీపీ నాయకులు పెంకె శ్రీను, మేడిశెట్టి సుబ్బారావు, రాయుడు రమణ, మేర్లా నరేష్ కుమార్, దంగేటి వెంకటరమణ, కాదా చిన్న, తాతపూడి నాగేశ్వ రరావు, దూలపల్లి ఇమ్మానియేల్, పెంకే ప్రకాష్‌రావు, పెంకే రాజు, కాకర్ల సుందర్రావు, గుబ్బల వెంకన్న, ములస బాబురావు, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## హరిహర క్షేత్రంలో దొంగలు

**– హుండీలు పగులగొట్టి చోరీ ప్రయత్నం**




**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** సామర్లకోట పట్టణంలోని 5 తూముల వద్దగల రైల్వే ట్రాక్ దగ్గర లో గోదావరి కాలువ వద్ద హరిహర క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన అన్నపూర్ణ సమేత రామ లింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. నలుగురు వ్యక్తులు ఆలయంలో ప్రవేశించి ప్రధానాలయం తాళాలు పగులగొట్టి అన్నపూర్ణ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి నకిలీ నగలు ధరించడంతో అవి నకిలీవని వదిలిపెట్టి వెళ్లారు. అనంతరం హుండీలను బయటకు తెచ్చివాటిని సయితం పగులగొట్టారు. అయితే ఇటీవలే హుండీలు ఖాళీచెయ్యడంతో చెప్పుకోదగ్గ ఆధాయం లేకపోవడంతో ఆలయానికి పెద్దగా నష్టం వాటిల్లలేదు. అలాగే ఆలయంలో ఉన్న అర్చకుని మోటారు సైకిల్ ను దొంగిలించేందుకు ప్రయత్నించి మరలా దానిని తీసుకువచ్చి ఆలయం బయట ఉంచి దొంగలు పరారాయ్యారు. కాగా ఈ చోరీ ప్రయత్నం పై ఆలయ స్వామీజీ పరమానంద గిరి స్వామి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు ఆలయంలో చోరీ జరిగిన ప్రయత్నాలను పరిశీలించారు. ఈ మేరకు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా కోరిన కోర్కెలు తీర్చే దైవంగా విరాజిల్లుతున్న వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి సీతానగరం మండలం చినకొందేపూడికి చెందిన కర్లపూడి గంగన్న రూ.1,11,111లు; రాజమండ్రికి చెందిన అరిగేలా శ్రీరామం, వెంకటరమణ దంపతులు రూ.10,116 లు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో సత్యనారాయణరాజు, కమిటీ సభ్యులు, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

## డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం




**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలువైపుల నుంచి పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా హాజరైయ్యారు. ఈ సమ్మేళన కార్యక్రమాన్ని కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పింజర్ల వీరభద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు కళాశాలలో పూర్వ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి బి.రత్న శేఖర్ (వైజాగ్ పోర్ట్ ట్రాఫిక్ మేనేజర్) కళాశాలకు ఇదివరకే ఇచ్చిన హామీ మేరకు ఆర్చ్, పార్కింగ్ షెడ్ నిర్మిస్తున్నామని తెలిపారు. దానితోపాటు కళాశాల గ్రౌండ్ శుభ్రపరిచి, రన్నింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తానని చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అందరూ కళాశాల ఆవరణలో ఆటపాటలతో ఆనందంగా గడపడం జరిగింది. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ కన్వీనర్ రవికుమార్, అధ్యాపకులు కె.జి. వెంకటేష్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంపి వంగా గీత చేతుల మీదుగా అథ్లెటిక్స్ ట్రాక్ శంకుస్థాపన





కాకినాడ, మేజర్ న్యూస్ : జెఎన్‌టియుకె క్రీడా ప్రాంగణంలో ఆదివారం ఉదయం ఖేలో ఇండియా పథకంలో భాగంగా యూనివర్శిటీకి మంజూరైన 400 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ (8లేన్లు) నిర్మాణానికి పార్లమెంటు సభ్యురాలువంగా గీతా విశ్వనాథ్ శంఖుస్థాపన చేశారు. కార్యక్రమానికి ఉపకులపతి ప్రొ.జి.వి.ఆర్.ప్రసాదరాజు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎంపి వంగా గీతా విశ్వనాథ్, గౌరవ అతిథులుగా కాకినాడ సిటీ శాసనసభ్యులు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కాకినాడ రూరల్ శాసనసభ్యులు కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తిలు విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపి వంగా గీతా విశ్వనాథ్ మాట్లాడుతూ జెఎన్‌టియుకె యూనివర్శిటీకి ఖేలో ఇండియా పథకంలో భాగంగా మంజూరైన 400 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్(8లేన్లు) నిర్మాణానికి మొత్తం రూ.13.55కోట్ల నిధులు అవసరం కాగా కేంద్ర ప్రభుత్వం రూ.9.50కోట్లు మంజూరు చేయడం జరిగిందని, దీనికి మ్యాచింగ్ గ్రాంట్‌గా యూనివర్శిటీ నుండి రూ.4.05కోట్లు నిధులు విడుదల చేయడం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యతోపాటు క్రీడలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ సిఎం కప్, ఆడుదాం ఆంధ్రా వంటి కార్యక్రమాలతో క్రీడాకారులు, గ్రామీణ ప్రజలు, గృహిణులుకూడా క్రీడలలో పాల్గొనేలా ఉత్సాహపరుస్తున్నార న్నారు. సింథటిక్ అథ్లెటిక్స్‌ట్రాక్ మంజూరుకు కృషి చేసిన జెఎన్‌టియుకె ఉపకులపతి ప్రొ.జివిఆర్.ప్రసాదరాజు మరియు యూనివర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ డా.జి.శ్యామ్ కుమార్‌లనుఆమెప్రత్యేకంగా అభినందించారు.కాకినాడ సిటీ శాసనసభ్యులు శ్రీ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కాకినాడ నగరంలో క్రీడలకు సంబంధించి మౌలిక వసతులుకల్పించడంజరిగిందని,సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ నిర్మాణం ద్వారా క్రీడాకారులకు మరింత సాధన చేయడం ద్వారా ఉత్తమ ప్రతిభ కనబర్చేందుకు అవకాశం కలుగుతుందన్నారు. కాకినాడ రూరల్ శాసనసభ్యులు కురసాల కన్నబాబు మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకమైన సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ కాకినాడ నగరానికే తలమానికంగా నిలుస్తుందని, దీని ద్వారా క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయిలోశిక్షణఇచ్చేందుకు ఉపకరిస్తుంద న్నారు.ఉపకులపతి ప్రొ.జివి ఆర్.ప్రసాదరాజు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర క్రీడల శాఖామంత్రి అనురాగ్ ఠాకూర్ సహకారంతో జెఎన్‌టియుకె యూనివర్శిటీకి 400 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ (8లేన్లు) మంజూరైందన్నారు. గత పది సంవత్సరాల క్రితం గుంటూరులో ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటుకాగా, ఆ తర్వాత జెఎన్‌టియుకె యూనివర్శిటీకి ఈ ట్రాక్ మంజూరైందన్నారు. ట్రాక్ నిర్మాణానికి త్వరితగతిన టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి సంవత్సరంలోపు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు.ఈ ట్రాక్ అందుబాటులోకి రావడం ద్వారా క్రీడాకారులు మరియు విద్యార్థులు మెరుగైన శిక్షణ పొందేందుకు వీలు కలుగుతుందన్నారు. అనంతరం అతిథులను యూనివర్శిటీ అధికారులు పుష్పగుచ్ఛాలతో సత్కరించి మెమెంటోలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొ.కె.వి. రమణ, రిజిస్ట్రార్ ప్రొ.ఎల్.సుమలత, ఓఎస్‌డి ప్రొ.డి.కోటేశ్వరరావు, డైరెక్టర్‌లు, స్పెషల్ ఆఫీసర్‌లు, యుసిఇకె వైస్ ప్రిన్సిపాల్, విభాగాధిపతులు, టీచింగ్ మరియు నాన్ టీచింగ్ సిబ్బంది, స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, ఫిజికల్ డైరెక్టర్‌లు, ప్రజాప్రతినిధులు, ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ పునః ఆవిష్కరణ కార్యక్రమం



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** రావులపాలెం మండలం వెదిరేశ్వరం గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ పునఃప్రతిష్ట, విగ్రహాన్ని ఆవిష్కరణ కార్యక్రమం ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి చేతుల మీదుగా ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ ఈ దేశానికి చేసిన మేలుని, ఆ మహానుభావుడు నిర్మించిన రాజ్యాంగాన్ని, త్యాగాలను చిరస్థాయిగా గుర్తుండిపోయేలా విజయవాడలో నిర్మించిన 206 అడుగుల అంబేద్కర్ గారి విగ్రహం, స్మృతివనమే చిహ్నం అని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాల కోసం, అణగారిన వర్గాల పక్షాన ఎల్లప్పుడూ నిలబడతానని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పేర్కొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ అంబాజీపేట మండలశాఖ అధ్యక్షుడు దొమ్మేటి సాయికృష్ణ ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనకబడి, ఇబ్బందులకు గురైన నిరుపేద బాధిత కుటుంబాలకు జనసేన పార్టీ అభిమాని గిడ్డి సత్యనారాయణ మండలంలోని మాచవరం, గంగలకుర్రు, మొసలపల్లి, ఇరుసుమండ గ్రామాల్లో ఐదు కుటుంబాలకు రూ.55 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు.ఈ సందర్భంగా గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ సేవాస్ఫూర్తితో తన వంతుగా నిరుపేద బాధిత కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో ఆర్థిక సాయం అదంచెసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుజిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, ఉమ్మడి తూర్పు జిల్లా కార్యదర్శి వాసంశెట్టి కుమార్, నూకపెయ్యి సూర్యచంద్రరావు, అరిగెల సూరిబాబు, యాగన కోటేశ్వరరావు, కొప్పినీడి ఈశ్వరరావు, చింతపల్లి సీతారాం ప్రసాద్, పితాని వెంకటేశ్వరరావు, తొత్తరమూడి హృదయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యోదయ చారిటబుల్ ట్రస్ట్‌కి మోడరన్ విద్యాసంస్థల వితరణ



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** విద్యార్థులలో పరోపకార గుణమును పెంపొందించి, సాటివారికి సాధ్యమైనంత సహాయం చేయాలనే తలంపుతో మోడరన్ విద్యాసంస్థల అధినేత లయిన్ జి.వి.రావు మోడరన్ విద్యాసంస్థల వివిధ విభాగాల్లో ఏర్పాటు చేసిన యూనివర్సల్ సింగిల్ ఫ్యామిలీ బాక్స్‌ల ద్వారా సేకరించిన 9,733 రూపాయల మొత్తాన్ని పట్టణంలోని విద్యోదయ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు రాంబాబుకు ఆదివారం నాడు జి.వి.రావు అందజేసారు. ఈ సందర్భంగా రావు మాట్లాడుతూ గత 6 సంవత్సరాలుగా తాము యు.ఎస్.ఎఫ్.బాక్స్‌ల ద్వారా సేకరించిన మొత్తాన్ని విద్యోదయ చారిటబుల్ ట్రస్ట్ కి అందజేస్తున్నామని, మనం చేసే చిరు సహాయం వల్ల అవతలి వారి మోములో సంతోషం చూడటం చాలా గొప్ప తృప్తిని ఇస్తుందని పేర్కొన్నారు. అనంతరం విద్యోదయ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు రాంబాబు మాట్లాడుతూ జి.వి.రావు సేవాకార్యక్రమలలో తన వంతు సహాయం చేయడంలో ముందు ఉంటారని, ఆయనతో పాటు మోడరన్ విద్యాసంస్థల విద్యార్థులకు కూడా ఈ పరోపకార గుణమును అలవర్చుటకు కృషి చేస్తున్న రావు అభినందనీయులని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, మోడరన్ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదంలో కిరాణా షాపు దగ్ధం

**– రూ.10 లక్షలు ఆస్తి నష్టం**



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** ఇటీవల బస్టాండ్ రోడ్‌లో ప్రారంభించిన గణపతి కిరాణా జనరల్ స్టోర్స్‌లో శనివారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో స్థానికుల సమాచారం ఇవ్వడంతో పెనుప్రమాదం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది షాపును పరిశీలించి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు ధృవీకరించారు. అగ్నిప్రమాదంలో కిరాణా సరుకులు దగ్ధం కావడంతో సుమారు రూ.10 లక్షలు ఆస్తి నష్టం జరిగినట్లు షాపు యజమాని సత్తి త్రిమూర్తులు తెలిపారు. అగ్నిప్రమాదం జరిగిన షాపును అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు రాజాపండు, పత్తి దత్తుడు,సుంకర బాలాజీ, అరిగెల సూరిబాబు, వాకపల్లి ఆనందబాబులు పరిశీలించారు.

### మండలంలో రూ.5 కోట్ల రూపాయల పలు అభివృద్ధి పనులు

**– ప్రారంభించిన ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి**



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వంలో ప్రతీ గ్రామంలో అభివృద్ధి పనులు జరిగాయని, సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా భావించి పరిపాలన సాగించారని, అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్ ను అగ్రస్థానంలో నిలిపారని ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. బొబ్బర్లంక గ్రామంలో 79.3 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్ల భవనాలను వెలిచేరు గ్రామంలో 56.8 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను, వద్దిపర్రు గ్రామంలో 79.3 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను, ర్యాలి గ్రామంలో 61.8 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను, నార్కెడ్ మిల్లి గ్రామంలో 1 కోటీ 95 లక్షల రూపాయలతో నిర్మించిన రోడ్లు, డ్రైనేజీలను, అంకంపాలెం గ్రామంలో 21.8 లక్షల రూపాయలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాలను ప్రభుత్వ విప్ మరియు శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి.. స్థానిక ప్రజాప్రతినిధులు, వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండా అన్నపూర్ణ, జడ్పిటిసి బోనం సాయిబాబా, ఎంపీడీవో నాతి బుజ్జి, మండల పార్టీ కన్వీనర్ కనుమూరు శ్రీనివాసరాజు, ఔట్సోర్సింగ్ డైరెక్టర్ కప్పుల శ్రీధర్, సర్పంచులు పాల నాగేశ్వరరావు, వేముల శ్రీనివాస్, కొల్లి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య మిత్రునికి తోడుగా...



**– సహచర బాల్య మిత్రునికి మూడు చక్రాల మోటార్ సైకిల్ ప్రదానం**
**– చేయూత అందించిన ఆనందభారతి హైస్కూల్ 1989-90 బ్యాచ్ పూర్వ విద్యార్థులు**

**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** సంకల్పం గొప్పదైతే సాధించ లేనిది ఏమి ఉండదని నిరూపించారు..కాకినాడ ఆనంద భారతి మున్సిపల్ హైస్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు. కష్టాల్లో ఉన్న బాల్య మిత్రుని తమకు తోచిన సాయం చేసేందుకు వారంతా ఒక్కటయ్యారు. రాష్ట్రంలోని వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడిన వారంతా బాల్య మిత్రుడు, సినీ నిర్మాత, పీ.డీ.ఆర్. ప్రసాద్ రెడ్డి నివాసంలో ఆదివారం సమావేశం అయ్యారు. గతేడాది జరిగిన ఆత్మీయ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు సమీకరించిన సుమారు రూ.1.25 లక్షలతో కొనుగోలు చేసిన మూడు చక్రాల మోటార్ సైకిల్‌ను వికలాంగుడైన బాల్య మిత్రుడు జీర వెంకటరమణకు అందజేశారు. అనంతరం ఆరవ తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠశాలలో గడిపిన మధుర జ్ఞాపకాలను మరోసారి గుర్తు చేసుకున్నారు. తమ వయస్సు, హోదాలను పక్కన పెట్టి ఆట పాటలతో ఆనందంగా ఆహ్లాదంగా గడిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న సహచర బాల్య మిత్రునికి చేయూత నివ్వాలని నిర్ణయం తీసుకోగానే ...క్షణం కూడా ఆలోచించకుండా ఆర్థిక చేయూత ఇచ్చేందుకు ముందుకొచ్చిన మిత్రులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. మిత్రుల ఔదార్యానికి జీవితాంతం రుణపడి ఉంటానని సమావేశంలో జీర వెంకటరమణ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇంటింటికి తిరుగుతూ వాము, అరుకు అమ్ముకుంటూ జీవనం సాగించే తనకు ఈ మూడు చక్రాల మోటార్ సైకిల్ ఎంతగానో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశం లో భవిష్యత్‌లో కూడా ఇదే మాదిరిగా సహచర మిత్రులకు ఏ కష్టం వచ్చినా ఆదుకోవాలని నిర్ణయించారు. పూర్వ విద్యార్థుల తరపున ప్రతీఏటా ఏదో ఒక సేవా కార్యక్రమం చేపట్టాలని తీర్మానించారు. ఇదే రీతిలో కష్టాల్లో ఉన్న బాల్యమిత్రులను గుర్తించి 1990వ పూర్వ విద్యార్థుల సంఘం తరపున ఆర్థిక చేయూత నివ్వాలని నిర్ణయించారు.

## "పల్లెకి పోదాం" కార్యక్రమంలో భాగంగా బిజెపి "ప్రవాసి కార్యకర్తలు" గ్రామాల్లో బస

**– కాకినాడ జిల్లాలో 7,8,9 తేదీల్లో కార్యక్రమం**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** సమీపిస్తున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని భారతీయ జనతా పార్టీ "పల్లెకు పోదాం" పేరుతో ఒక కార్యక్రమాన్ని రూపొందించింది. భారతీయ జనతాపార్టీ జాతీయ అధ్యక్షులు జగత్ ప్రకాష్ నడ్డా, రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పిలుపు మేరకు బిజెపి జిల్లా అధ్యక్షుడు చిలుకూరు రామకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లాలోని 385 గ్రామపంచాయతీలు, 412 గ్రామాలు, 21 మండలాల పరిధిలో "పల్లెకు పోదాం" కార్యక్రమం నిర్వహణ గురించి విస్తృతంగా చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న మాజీ శాసనసభ్యుడు అయ్యాజీ వేమ ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫిబ్రవరి 4 నుంచి 11వ తేదీల మధ్య ఈ కార్యక్రమం జరగవలసి ఉంది అయితే ప్రతి జిల్లా ఈ తేదీల మధ్య మూడు రోజులు పాటు ఈ కార్యక్రమం నిర్వహించే విధంగా తేదీలు నిర్ణయించుకోవచ్చు. కాకినాడ జిల్లాలో ఫిబ్రవరి 7, 8, 9 తేదీలలో ఈ "పల్లెకి పోదాం" కార్యక్రమాన్ని నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఈ కార్యక్రమ నిర్వహణకు కాకినాడ జిల్లా వత్సవాయ వరాలబాబును కన్వీనర్ గాను, జీలకర్ర సత్తిబాబు, కర్రెట్ల దేవికలను కోకన్వీనర్లుగాను సమావేశం ప్రకటించడం జరిగింది. అదేవిధంగా మండల స్థాయిలో ఒక కన్వీనర్ను, ఒక కో–కన్వీనర్ ను నియమించడం జరుగుతుంది. పార్టీలో 24 గంటలు సమయాన్ని కేటాయించగలిగిన బూత్ స్థాయి నాయకులను గుర్తించి పల్లెకు పోదాం కార్యక్రమంలో "ప్రవాసి కార్యకర్తలు"గా గ్రామాల్లోకి వెళ్లి 24 గంటలు బస చేస్తారు. ఈ సమయంలో ఈ "ప్రవాసి కార్యకర్తలు" ఆ గ్రామంలోని పెద్దలను, ఇతర పార్టీల నాయకులను, అనేక వర్గాలవారిని కలుసుకొని వారిని పార్టీలోకి ఆహ్వానించడంతోపాటు ప్రధానమంత్రి చేపట్టిన పేదల సంక్షేమం, మహిళా సాధికారిత, దేశ భద్రత, సాంస్కృతిక పునర్జీవనం కార్యక్రమాలను వారికి వివరించడం జరుగుతుంది. 1000 మంది ఉన్న గ్రామానికి ఒక ప్రవాసి కార్యకర్త, 1000 కన్నా ఎక్కువ మంది ఉన్న గ్రామానికి 1000 మందికి ఒక కార్యకర్త చొప్పున "ప్రవాసి కార్యకర్తలు" గ్రామాల్లో పని చేయడం జరుగుతుంది. ఇప్పటికే భారత సంకల్పయాత్ర పేరుతో గ్రామాల్లో విస్తృతంగా కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి పార్టీ వివరించే ప్రయత్నం చేస్తోంది. "పల్లెకు పోదాం" కార్యక్రమం వివరాలను మీడియా ప్యానలిస్ట్ దువ్వూరి సుబ్రమణ్యం పత్రికలకు విడుదల చేశారు.ఈ సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్, తుమ్మల పద్మజ, దాట్ల సూర్యనారాయణ రాజు, కొక్కిలిగడ్డ గంగరాజు, గండి కొండలరావు,మట్ట మంగరాజు, గట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అట్టడుగు వర్గాల ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం అట్టడుగు వర్గాల ప్రజలు ఆర్థిక వికాసం కోసం అనేక పథకాలను రూపొం దించి ందని భారతీయ జనతా పార్టీ నాయకులు ఎనిమిరెడ్డి మాలకొండయ్య తెలిపారు. నగరంలో 38, 39, 41, 42, 43 వార్డులలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా గాంధీనగర్ పార్కు వద్ద ఉదయం 11 గంటలకు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. డిప్యూటీ డైరెక్టర్ అమృత్, సిహెచ్ ప్రసాద్‌రావు ఇన్చార్జిగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు, బ్యాంకు అధికారులు, ఆర్పీలు సుమారు 200 మంది లబ్ధిదారులు పాల్గొన్నారు. స్థానిక గాంధీ నగర్ పార్కు సమీపంలో అనేక ప్రభుత్వ శాఖలకు సంబంధించి స్టాల్స్ ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక వికాసం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన, అటల్ పెన్షన్ యోజన, భేటీ బచావో– బేటి పడావో, స్టాండ్ అప్ ఇండియా, స్మార్ట్ సిటీ, ఆత్మ నిర్భర భారత్, పీఎం గరీబ్ కళ్యాణ్ అన్నయోజన, ముద్ర యోజన, స్టాండప్ ఇండియా, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల గురించి వివిధ శాఖల అధికారులు అధికారులు వివరించడం జరిగింది. భారతీయ జనతా పార్టీ నాయకులు ఎనిమిరెడ్డి మాలకొండయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అట్టడుగు వర్గాల ప్రజలు ఆర్థిక వికాసం కోసం అనేక పథకాలను రూపొందించిందని లబ్ధిదారులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముత్త నవీన్, గట్టి సత్యనారాయణ, దువ్వూరి సుబ్రహ్మణ్యం, రంబాల వెంకటేశ్వరరావు, కొక్కిలిగడ్డ గంగరాజు, పొనుగుపాటి చినసుబ్బారావు, పానకాల రామకృష్ణ తదితర బిజెపి నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించారు.

## కార్మికవర్గ పోరాటాల్లో లెనినిజం ఉంది

**– భారత స్వాతంత్ర్య పోరాటానికి గొప్ప ప్రేరణ కలిగించింది అక్టోబర్ విప్లవం**
**– కార్మిక కర్షక మైత్రితో కార్మిక రాజ్య స్థాపనే లెనిన్ చూపిన బాట**
**– ఆర్.వి.ఎన్. స్టడీ సర్కిల్ సదస్సు మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రపంచంలో నేడు జరుగుతున్న కార్మిక వర్గ పోరాటాల్లో లెనినిజం ఉందని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ తెలిపారు. శనివారం సాయంత్రం కాకినాడ యుటిఎఫ్ హోంలో రఘుపతి వెంకటరత్నం నాయుడు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో "లెనినిజం విశిష్టత – అక్టోబర్ విప్లవం – భారతదేశం" అనే అంశంపై సదస్సు నిర్వహించారు. పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సత్తిరాజు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఎంవిఎస్ శర్మ ముఖ్యవక్తగా ప్రసంగించారు. ప్రపంచ విముక్తి సిద్ధాంతాన్ని మార్క్స్ ఎంగెల్స్ రూపొందించగా, ఆచరణలో కార్మిక రాజ్య స్థాపన ఎలా జరుగుతుందో కార్యాచరణ ద్వారా లెనినిజం సాకారం చేసిందన్నారు. కార్మిక కర్షక మైత్రి ప్రాధాన్యత ను లెనినిజం చాటి చెప్పిందన్నారు. లెనిన్ ప్రసిద్ధ రచన "ఏమి చేయాలి" కార్యాచరణ కు మార్గదర్శిగా ఉందన్నారు. భగత్ సింగ్ ఉరితీసే కొన్ని క్షణాల ముందు కూడా లెనిన్ రచనలు అధ్యయనం పూర్తి చేసి ఉరికంబం ఎక్కారని తెలిపారు. వలసవాదాన్ని ఎదిరిస్తూ ప్రపంచంలో జాతీయ విముక్తి ఉద్యమాలకు అక్టోబర్ విప్లవం గొప్ప స్ఫూర్తిని ఇచ్చిందన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటానికి అక్టోబర్ విప్లవం ప్రేరణ గా నిలిచిందని, తొలిసారిగా సంపూర్ణ స్వాతంత్ర్యం నినాదం కమ్యూనిస్టు భావజాలం కలిగిన వారే ఇచ్చారని తెలిపారు. నేడు ప్రపంచంలో అనేక దేశాల్లో కార్మిక పోరాటాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని వాటన్నింటి వెనుక లెనినిజం ఉందన్నారు. మార్క్సిజం అర్థం చేసుకుని, లెనినిజాన్ని కార్మిక వర్గం ఆచరణలో పెడితే సమసమాజానికి మార్గం సుగమం అవుతుందన్నారు.సదస్సు కు జన విజ్ఞాన వేదిక నాయకులు జి.ఎస్.హెచ్.పి. వర్మ ఆహ్వానం పలుకగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కెవివి నగేష్ వందన సమర్పణ చేశారు. ఆర్.వి.ఎన్. స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎన్. గోవిందరాజులు తోపాటు వివిధ ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు, తానీషా అభ్యుదయ గీతాలు ఆలపించారు.

## 700 ఇళ్ళ స్థలాలు లబ్ధిదారులకు అందచేసిన ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి

**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** రావులపాలెం మండలం గోపాలపురం గ్రామంలోని పేదలందరికీ ఇళ్ళు లేఔట్ 1,2,3ల నందు సుమారు 700 మంది లబ్ధిదారులకు ఇండ్ల స్థలాలు ప్రభుత్వ విప్ మరియు శాసనసభ్యులు సాంప్రదాయబద్ధంగా ఆడపడుచుకి అందించినట్టు జాకెట్ ముక్క, గాజులు, పసుపు కుంకుమలతో అందచేశారు.

ఈ సందర్భంగా అద్దె ఇళ్లల్లో కష్టాలు పడుతున్న వారందరికీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సొంతింటి కల నెరవేర్చడానికి ఇచ్చిన మాట ప్రకారం ఇండ్ల స్థలాలు అందించడానికి అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కృషి పట్ల ఆడపడుచులు అందరూ హర్షం వ్యక్తం చేశారు.



### ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీల విజేత

**– బెల్లంపూడి**



**పి.గన్నవరం, మేజర్ న్యూస్ :** పి.గన్నవరం నియజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా కబడ్డీ పోటీలలో బెల్లంపూడి కబడ్డీ జట్టు విజే తగా నిలిచింది . పి.గన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలలో బెల్లంపూడి గ్రామ సచివా లయం జట్టు సెమీ ఫైనల్‌లో అంబాజీపేట మండలం జట్టుపైన మరియు ఫైనల్ మ్యాచ్‌లో అయినవిల్లి మండలంపైన వరసగా విజయం సాధించి పి.గన్నవరం నియోజకవర్గ స్థాయి లో విజేతగా బెల్లంపూడి గ్రామ సచివాలయం జట్టు విజేతగా నిలిచింది. త్వరలో జరిగే డా.బి. ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్రా కబడ్డీ పోటీలకు ఎంపికయ్యింది.పి.గన్నవరం నియజకవర్గ స్థాయిలో ఆడుదాం ఆంధ్రా పోటీలలో గెలుపొంది, విజేతగా నిలిచిన బెల్లంపూడి గ్రామ కబడ్డీ జట్టుకు రూ.35 వేలు, ట్రోఫీ, మెడల్స్, సర్టిఫికెట్స్‌ను ప్రభుత్వం అందజేయనుంది. నియోజ కవర్గ స్థాయిలో కబడ్డీ పోటీలలో విజేతగా నిలిచిన బెల్లంపూడి కబడ్డీ జట్టు క్రీడాకారులను గ్రామ సర్పంచ్ "బండి మహాలక్ష్మీ", "బండి రమేష్", గ్రామ సచివాలయం సిబ్బంది,పి.గన్నవరం మండల అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

సూర్య
తూర్పుగోదావరి
సోమవారం
29 జనవరి 2024



## పెద్దాపురం మున్సిపల్ కమీషనర్‌గా కె.వి.పద్మావతి బాధ్యతలు స్వీకరణ



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మున్సిపల్ కమీషనర్‌గా కె.వి.పద్మావతి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మున్సిపల్ కమీషనర్‌గా విధులు నిర్వహిస్తూ ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు నిర్వహించిన బదిలీలలో భాగంగా పెద్దాపురం మున్సిపల్ కమీషనర్‌గా రావడం జరిగింది. ఇప్పటివరకు ఇక్కడ మున్సిపల్ కమీషనర్‌గా విధులు నిర్వహించిన జె.సురేంద్ర విశాఖ నగరపాలక సంస్థ సూపరింటెండెంట్‌గా బదిలీపై వెళ్ళారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమీషనర్ కె.వి.పద్మావతిని మున్సిపల్ డిఇ ఆదినారాయణ, ఏఇ కృష్ణజీవప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, సీనియర్ అసిస్టెంట్‌లు పి.డి.వి.ఎన్.వి.ప్రసాద్, బి.వి.వి.తాతాజి, పలువురు మున్సిపల్ సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలుసుకుని, అభినందనలు తెలిపారు. అనంతరం కమీషనర్ పద్మావతి మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారును ఆమె స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

## శ్రీనివాసరావును సత్కరించిన ఐటిడిపి అధ్యక్షులు



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** కె.పెదపూడి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పెదపూడి శ్రీనివాస్ ను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమించబడిన సందర్భంగా ఆయనను పి. గన్నవరం నియోజకవర్గం అయినవిల్లి మండలం ఐటీడీపి అధ్యక్షులు కెవివి సత్యనారాయణ అదర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేదునూరు ఐటీడీపి అధ్యక్షులు జంగా ప్రసాద్, అయినవిల్లిలంక ఐటీడీపి అధ్యక్షులు గెద్దం రమేష్, తొత్తరమూడి ఐటీడీపి అధ్యక్షులు వార గణేష్, పెదపాలం ఐటీడీపి అధ్యక్షులు కుడిపూడి గణేష్, చింతలంక ఐటీడీపి అధ్యక్షులు మంద రామకృష్ణ, వెలువలపల్లి ఐటీడీపి అధ్యక్షులు మోర్త వెంకటేశ్వరావు, బూత్ కమిటీ సభ్యులు కర్రి రాము, మోర్త మూర్తి, శేఖర్, గుబ్బల తేజ తదితరులు పాల్గొన్నారు.

# మన అక్కా చెల్లెళ్ళు లక్షాధికారులు

**– ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో**
**వైయస్సార్ ఆసరా ద్వారా పూర్తిగా రుణ మాఫీ చేశాం**
**– రాష్ట్రవ్యాప్తంగా 4వ విడతలో 7,98,345 గ్రూపులకు**
**రు. 25 వేల570 కోట్ల రూపాయలు అందించాం**
**– నాలుగు విడతల్లో 2635 గ్రూపులకు రు.99.77 కోట్ల రుణమాఫీ**
**– మంత్రి వేణుగోపాలకృష్ణ**





**రాజమహేంద్రవరంరూరల్,మేజర్‌న్యూస్:** ప్రజా సంకల్ప పాదయాత్రలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం స్వయం సహాయక సంఘ మహిళలను రుణ విముక్తులను చేస్తూ వై.యస్.ఆర్. ఆసరా పథకాన్ని 4 విడతల్లో అమలు చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపామని జిల్లా ఇన్చార్జి మంత్రి బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు సినిమాటోగ్రఫి శాఖా మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ పేర్కొన్నారు.ఆదివారంరాజమండ్రి రూరల్ మండలం లో నాలుగో విడత ఆసరా కార్యక్రమానికి హుకుంపేట "డి మార్ట్ " ప్రక్కన గల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జి మంత్రి వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర గ్రీన్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, అధికారులు స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకృష్ణమాట్లాడుతూరాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళల ఆర్థికస్వావలంబనే లక్ష్యంగా అనేక సంస్కరణలు చేపట్టారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైయస్సార్ ఆసరా పథకం కింద నాలుగు విడతలుగా 7,98,395 గ్రూపులోని 79 లక్షల మంది సభ్యులకు రూ. 25వేల570 కోట్ల ఆసరాగా స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు డ్వాక్రా రుణాలను పూర్తిగా చెల్లించి ఆర్థిక భరోసాను కల్పించామన్నారు. ఒక్క రాజమండ్రి రూరల్ మండలం లోనే గత నాలుగు విడతలుగా ఆసరా పథకం క్రింద 2635 స్వయం సహాయక సంఘాల గ్రూపులకు రు.99.15 కోట్ల ను వైయస్సార్ ఆసరా ద్వారా అందించడం జరిగిందని పేర్కొన్నారు. ఒక్క నాలుగో విడతలోనే రూరల్ మండలంలో రు.22.77 కోట్ల రుణమాఫీ చేశామన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో స్వయం సహాయ సంఘాల గ్రూపు సభ్యులకు పావలా వడ్డీ అందిస్తే, నేడు ముఖ్యమంత్రి జగనన్న ఆసరా పథకం ద్వారా పూర్తి రుణమాఫీచేశారని మంత్రి పేర్కొన్నారు. మహిళల్లో ఆర్థిక చైతన్యాన్ని తీసుకొచ్చే దిశగా పీవీ నరసింహ రావు ప్రధానమంత్రిగా వారి ఆర్థిక పురోభివృద్ధికి మైక్రో ఫైనాన్స్ సిస్టం ఏర్పాటు చేసి మహిళలు పొదుపు చేసే సంస్కృతిని ప్రారంభించా రన్నారు. గత ప్రభుత్వం హాయాంలో రూ.285 కోట్లు రుణాలు తీసుకుంటే గడచిన పదేళ్లలో మహిళలు రూ.10 వేల కోట్ల వారి ఆర్థిక స్వాముల కొరకు పదివేల కోట్లు రుణాలను పొందాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి అన్న మాట నిలుపు కోలేదన్నారు. నేడు సీఎం జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో నాడు ఇచ్చిన హామీని నాలుగు దఫాలుగా ఆసరాగా రుణమాఫీ చెల్లించారని మంత్రి పేర్కొన్నారు

ప్రతి పేదవాడి ఆరోగ్య సంరక్షణ తండ్రి వైయస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా రు.2.5 లక్షల రూపాయల వరకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తే, నేడు తండ్రికి తగ్గ తనయుడుగా ఆరోగ్యశ్రీ ద్వారా రు. 25 లక్షల ఖరీదైన వైద్య సేవలను పేర్కొన్నారు. పేదవాడి ఆత్మగౌరవాన్ని మరింత ఇనుమడింప చేసే విధంగా సీఎం జగనన్న అనేకసంస్కరణలుచేపట్టారని అందులో భాగంగానే వాలంటరీ, సచివాల యం వ్యవస్థలను ఇంటి ముందుకే తీసుకొచ్చారన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించే అమ్మ ఒడి అనే ఔషధాన్ని ప్రవేశపెట్టి ప్రతి పేద విద్యార్థి ఇంగ్లీష్ మీడియంతో కూడిన చదువులు చదివే విధంగా సీఎం బాటలు వేశారని పేర్కొన్నారు. నాడు దేశానికి స్వాతంత్రం సాధనకు మహాత్మా గాంధీ ఎనలేని కృషి చేశారని, ప్రతి ఒక్కరికి సమాజంలో సమాన హక్కుల కలిగి ఉండే విధంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగం అనే గ్రంధాన్ని మనకు అందించి పూల బాట వేశారని మంత్రి అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగున్నర సంవత్సరా లలో రూ.2 లక్షల 53 వేల కోట్లను వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు చేయగా ఒక బీసీ సంక్షేమానికే ఒక లక్షా 90 వేల కోట్లు రూపా యలు ఖర్చు చేశామని మంత్రి సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీన్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చంద్ర నాగేశ్వర్, డిఆర్డిఎ పిడిఎన్వి ఎస్ మూర్తి, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ కే ఎన్ జ్యోతి, ఎంపీడీవో ఎం శ్రీనివాసరావు, మండల జెసిఎస్ సెక్రటరీ తాడికొండ విష్ణుమూర్తి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, స్థానిక నాయకులు ముత్యాల పోసుకుమార్, సాధనాల శివ, బొప్పన సుబ్బారావు సచివాలయ కన్వీనర్లు, సచివాలయ ఉద్యోగులు, ఆర్పీలు,మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు ఆర్డీఓ కార్యాలయంలో ప్రజా స్పందన



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా స్పందన కార్యక్రమం నిర్వహించబడునని, ఆర్డీఓ కార్యాలయం ఒక ప్రకటనలో భాగంగా తెలిపింది. దీనిలో భాగంగా సోమవారం ఉదయం 10 గంటల నుండి ప్రజా స్పందన కార్యక్రమం డివిజన్‌లోని 11 మండలాల పరిధిలో గల అర్జీదారులు ప్రజా స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆర్డీఓ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

## శ్రీ మరిడమ్మ అమ్మవార్కి పంచామృతాభిషేకం



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ సిహెచ్.రామ మోహన రావు ఆధ్వర్యంలో వేదపండితులు మరిడమ్మ అమ్మవార్కి మఖ నక్షత్రం సందర్భంగా పంచామృతాభిషేకం నిర్వహించి, బంగారు, వెండి పుష్పాలతో అర్చన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది కె.వి.డి. ప్రసాద్, వరహాలు, క్రాంతివీర్, లోవ,శివ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సోమవారం స్పందన, డయల్ యువర్ కమిషనర్

**– కమిషనర్ సిహెచ్ నాగనరసింహారావు వెల్లడి**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగనం సింహారావు చెప్పారు. స్థానిక సమస్యలను కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 0884-2357800 కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. అలాగే 10:30 నుంచి స్పందన కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## సంకురాత్రి ఫౌండేషన్ చైర్మన్‌ను కలిసిన శ్రీనివాసరావు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సంకురాత్రి ఫౌండేషన్ సంస్థ నిర్వహిస్తున్న చైర్మన్ పద్మ శ్రీ అవార్డు గ్రహీత సంకు రాత్రి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చంద్ర శేఖర్ జిల్లా యువజన సంఘం కార్యదర్శి మరియు జిల్లా ఆర్టీఐ మెంబర్ అయినా గేదెల శ్రీనివాస్ కలిశారు. ఈ సందర్భంగా జిల్లా యువజన సంఘాల కార్యదర్శి గేదెల శ్రీనివాసరావు మాట్లాడుతూ సంకు రాత్రి ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌ని కలిసి అభినందించడం సంతోషంగా ఉందని అన్నారు. ఒకవైపు సంస్థ కార్యక్రమాలతో పాటుగా కిరణ్ నేత్రాలయాన్ని కూడా నిర్వహిస్తూ సేవలు అందిస్తున్నారని అన్నారు. అటువంటి సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ అవార్డు ప్రకటించడం ప్రతి సారి స్వాతంత్ర దినోత్సవం మరియు రిపబ్లిక్ డే ఉత్సవాల్లో ఆయనను సత్కరించడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు జిల్లా ప్రజలకు ఆయన సేవలు మరింత అవసరమని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చంద్రశేఖర్ గారు నిర్వహించాలని ఆయన నిర్వహించే సేవా కార్యక్రమాలకు తమ యువజన సంఘాల తరఫున సేవా కార్యక్రమాల్లో తాము సైతం పాల్గొంటామని ఈ సందర్భంగా గేదెల శ్రీనివాసరావు విలేకరులకు తెలిపారు.

## జనవరి 29వ తేదీ సోమవారం యధాతధంగా జిల్లా కలెక్టరేట్లో, డివిజన్, మండల స్థాయి స్పందన

**– కలెక్టర్ డా.కే.మాధవీలత**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా, డివిజన్, మండల స్థాయి స్పందన కార్యక్రమం జనవరి 29 సోమవారం యధావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. కె. మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేం ద్రవరంలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో, అదేవిధంగా డివిజన్ స్థాయిలో ఆర్డీవో, మునిసిపల్ స్థాయిలో కమిషనర్లు, మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి, గ్రామ, వార్డు సచివాలయాల నుంచి ప్రజలు నుంచి సంబంధిత సిబ్బంది స్పందన అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ఉదయం 10.00 నుంచి మ.1.00 వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ, మునిసిపల్, మండల, గ్రామ, వార్డు సచివాలయాలలో స్పందన ఫిర్యాదులు అంద చేయాలని కలెక్టర్ తెలియచేశారు. మండల స్థాయి అధికారులు అందరూ మండల ప్రధాన కేంద్రంలో ఒకే చోట హాజరై ప్రజల నుంచి స్పందన అర్జీలు స్వీకరించాలన్నారు.

## ఫిబ్రవరి 4న పీఎంపిల రాష్ట్ర మహాసభ



**– ఛలో విజయవాడకు పిలుపు**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా గ్రామీణ వైద్యుల రాష్ట్ర మహాసభ, కాన్సర్ పై అవగాహన కార్యక్రమాలు ఫిబ్రవరి 4వ తేదీన విజయవాడలో జరుగుతాయని ఈ అవగాహన సదస్సుకు కాకినాడ జిల్లాలోని పీఎంపీలందరూ హాజరు కావాలని కమ్యూనిటీ పారామెడిక్స్ & ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగుమళ్ళ రాంబాబు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు, ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బళ్ళా శ్రీనివాసరావు, కాకినాడ జిల్లా అధ్యక్షులు కే.ఎస్.ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక లక్ష్మీ హాస్పిటల్ ఆవరణలో అసోసియేషన్ కాకినాడ అధ్యక్షులు సిహెచ్ ఏడుకొండలు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం, వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న గంగుమళ్ళ రాంబాబు, బళ్ళా శ్రీనివాసరావు, కే.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ గ్రామీణ వైద్యుల సంఘాల సమాఖ్య (ఫెడరేషన్) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4న విజయవాడలో జరిగే గ్రామీణ వైద్యుల రాష్ట్ర మహాసభకు, ప్రపంచ కాన్సర్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేస్తున్న కాన్సర్‌పై అవగాహన ర్యాలీకి, ప్రతీ పీఎంపీ తరలిరావాలని కోరారు. తొలుత కాకినాడ లక్ష్మీ హాస్పిటల్ ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ కే.ఉమాశంకర్ మాట్లాడుతూ కీళ్ళ శస్త్రచికిత్సలలో రోబోటిక్ శస్త్రచికిత్స గురించి వివరించారు. డాక్టర్ కె.రామానంద రెడ్డి, డాక్టర్ రేవూరి నవీన్ లు మాట్లాడుతూ పీఎంపీలు ఆధునిక వైద్య విధానాలపై అవగాహన కల్గి వుండాలని సూచించారు.

కార్యక్రమంలో కాకినాడ జిల్లా కార్యదర్శి ఎం.డి. తానీషా, జిల్లా కోశాధికారి వై. శ్రీనివాసరావు, మండల కార్యదర్శి కే. శ్రీనివాసరావు, ఎస్కే బాబ్జీ, తూర్పుగోదావరి జిల్లా కోశాధికారి పి.చిన్ని, గొల్లప్రోలు మండల అధ్యక్ష కార్యదర్శులు జి.ఎన్. సత్యనారాయణ, మడకా సత్యనారాయణ, యు.కొత్తపల్లి కన్వీనర్ డి.ప్రసాద్, కో-కన్వీనర్ జె.రాజాలింగం, మస్కపల్లి రాజు, ఎమ్.నాగేశ్వరరావు ల తోపాటు సభ్యులు హాజరయ్యారు. అనంతరం వైద్యులను సభ్యులను సత్కరించారు.

# మన్యంలో మెరిసిన ముత్యం..



**– అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకం..**

**కూనవరం, మేజర్ న్యూస్ :** కూనవరం మండలం గొమ్ము అయ్యావారిగూడెం గ్రామానికి చెందిన కర్నాటి శ్రీనివాసరావు కుమారుడు కర్నాటి మోహన్ ఛత్తిష్ ఘడ్ రాష్ట్రంలో ఎన్. ఐ.టి. రాయ్ పూర్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా జాయిన్ అయిన సందర్భంగా సీపీఎం, మరియు కాంగ్రెస్ మండల నాయకులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ మారు మూల రైతు కుటుంబంలో పుట్టి ప్రొఫెసర్ గా రాణించడం అంటే మాటలు కాదని ఎంతో కృషి, పట్టుదల ఉంటే తప్ప సాధ్యం కాదని అన్నారు.కష్టానికి తగిన ఫలితం దక్కిందని అన్నారు.ఇంకా ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమం లోవైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సీపీఎం పార్టీ జిల్లా నాయకులు మేకల నాగేశ్వరావు, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, సీనియర్ నాయకులు తలగాని నాగరాజు, షణ్ముకేశ్వరావు, నోముల సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీమంతుల వెంకటరమణ, సతీష్, స్థానిక ఎంపీటీసీ జయ సుధ, సర్పంచ్ బొగ్గా రామారావు, సుబ్బయ్య, బాబురావు, తాళ్లూరి శ్రీనివాసరావు, ఆవుల మురళి ఆవుల ఉపేంద్ర బొర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## గజల్ శ్రీనివాస్ చేతులు మీదుగా సత్కారం అందుకున్న డిఎస్ రావు



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఆంధ్ర సరస్వత పరిషత్ రాజమహేంద్రవరంలో జనవరి 5,6,7వ తేదీన నిర్వహించిన రెండవ అంతర్జాతీయ తెలుగు సభలలో సహకరించిన వారందరికీ ఆదివారం ఉదయం స్థానిక జే.ఎన్. రోడ్డు ఏకేసి కాలేజీలో ఆంధ్ర సరస్వతి పరిషత్ అధ్యక్షులు గజల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కృతజ్ఞతాంజలి సభ లో అంతర్జాతీయ తెలుగు సభలలో సహకరించిన (జర్నలిస్ట్) డి ఎస్ ఎస్ శ్రీనివాసరావు కు సత్కారం నిర్వహించారు. ఈ కృతజ్ఞతాంజలి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా

ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ ప్రీవ్యూ న్యాయమూర్తులు బులుసు శివశంకర్, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, ఆడిటర్ భాస్కర్ రామ్, గజల్ శ్రీనివాస్, ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం అపుస్మా స్కూల్స్ అధినేతలు, అంతర్జాతీయ తెలుగు సభలలో సహకరించిన నగర ప్రముఖులకు అందరికీ గజల్ శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# పద్మశాలీలకు అన్ని విధాలుగా అండగా నిలిచింది సీఎం జగనే

**– వైకాపా రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు**



**పెదపూడి, మేజర్ న్యూస్ :** చేనేత కార్మికుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని, పద్మశాలీల పక్షపాతి జగన్ అని వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి, కాకినాడ సిటీ ఎన్నికల పరిశీలకులు అద్దంకి ముక్తేశ్వరరావు అన్నారు. ఇటీవల నూతనంగా వైఎస్సార్సీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన పప్పు సింహాచలానికి పెదపూడి మండలం సంపర లో అభినందన సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముక్తేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఎన్నడులేని విధంగా ఒక్క ముఖ్యమంత్రి జగన్, అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి హయాంలోనే పద్మశాలీల అభివృద్ధి జరిగిందన్నారు. పద్మశాలీల జగన్ కు అండగా నిలిచిన జగన్ ను రెండోసారి ముఖ్యమంత్రిగా, డాక్టర్ సత్తి ను ఎమ్మెల్యే గా గెలిపించాలని కోరారు. సన్మాన గ్రహీత పప్పు సింహాచలం మాట్లాడుతూ పద్మశాలీల అభివృద్ధి సంక్షేమం మరింత జరగాలన్న, ఉన్నత స్థానాలు సాధించాలన్న అందరం ఐక్యతగా జగన్ను మళ్లీ ముఖ్యమంత్రిగా, ఎమ్మెల్యేగా డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. తాను పార్టీకి, పద్మాశాలీల సంఘానికి అందిస్తున్న సేవలకు గుర్తించి రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శిగా నియమించడం అభినందనీయమని, ఈ నియమానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాన్నారు. పండితులు ఖండవిల్లి హనుమంతాచార్యులు మంత్రోచ్చరణతో సింహాచాలనికి శాలువ కప్పి పూలమాలలు వేసి జ్ఞాపిక అందించి వైభవంగా సత్కరించారు. కార్యక్రమంలో పద్మాశాలీల సంఘం ప్రతినిధులు శేశెట్టి శివరామ్, పప్పు పైడియ్య, పప్పు జోగారావు, పప్పు శ్రీనివాసురావు, గోపి సురేష్, చింతకిందరాము, సూరిబాబు, పాపారాయుడు, విజయకుమార్, నీలం రాజు తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు – ఎస్సై సురేష్



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** జిల్లా ఎస్.పి. సతీష్ కుమార్, డిఎస్పి కె.లతాకుమారిల ఆదేశాల మేరకు పెద్దాపురం మండల, పట్టణ పరిధిలో శాంతి కమిటీల సమావేశం నిర్వహించడం జరిగింది. శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వెలుగుల సురేష్ హెచ్చరించారు. మండలంలో కాండ్రకోట గ్రామంలో శాంతి కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో అందరూ శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు నిర్వహించుకోవాలని సూచించారు. అలాగే శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం మహిళలకు శాంతి కమిటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, ప్రజలు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### ఇర్రిపాకలో కోటి మట్టి శివలింగాల తయారీని పరిశీలించిన స్వామీజీ శ్రీ వాత్సల్య ధర్మ వీర

జగ్గంపేట, మేజర్ న్యూస్ : ఇర్రిపాక గ్రామంలో ఏలేరు నది తీరాన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయం వద్ద కోటి మట్టి శివలింగాలతో మహా కుంభాభిషేకం నిర్వహించి తలపెట్టిన జ్యోతుల నెహ్రూ కుటుంబం రాష్ట్రం నలుమూల నుండి విచ్చేస్తున్న భక్త జన సందోహం మట్టి శివలింగాలు తయారీ చేయడం జరుగుతుంది. ఇక్కడ కోటి పార్థివ శివలింగాల తయారీ జరుగుతుంది అని తెలుసుకునిఅరుణాచలం శ్రీవత్స పీఠం (తిరువణికమలై) పీఠాధిపతి స్వామీజీ శ్రీ వాత్సల్య ధర్మ వీర స్వామివారి విచ్చేసి లింగాల తయారీని వీక్షించారు. అనంతరం జ్యోతుల నెహ్రూ తో మాట్లాడుతూ ఈ బహుత్తర మహా యజ్ఞంలో కుంభాభిషేకం జరిగే సమయంలో 11 రోజులలో ఒకరోజు నేను కూడా వచ్చి ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటానని అన్నారు. ఇంతటి మహా యజ్ఞాన్ని నిర్వహిస్తున్న జ్యోతుల నెహ్రూ కుటుంబానికి ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో జ్యోతులమణి, తోట సర్వారాయుడు, తోట సునీత, బోదిరెడ్ల సుబ్బారావు, అడబాల సత్తిబాబు, నున్నం రాంబాబు, దిద్దీ రాజు, జ్యోతుల వీరభద్రరావు, దొడ్డిపట్ల బుజ్జి, పలివెల లోకేష్, కంద సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

## నిలువ నీడలేని కుటుంబానికి అండగా ఉంటాం

**– రేకులు, ఇనుప పైపులు, 30 వేల రూపాయల**
**నగదు సహాయం చేసిన జమాల్ ఖాన్ ట్రస్ట్**
**– జమాల్ ఖాన్ ట్రస్ట్ సభ్యులకు**
**రుణపడి ఉంటాం అంటున్న కుటుంబ సభ్యులు**




**ఎటపాక, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక గ్రామంలో గత మూడు సంవత్సరాల క్రితం మిరియాల.పార్వతి నివాసగృహం(పూరి ఇల్లు) కాలిపోవడంతో వారి కుటుంబం రోడ్డున పడ్డది.ఆ కుటుంబ సభ్యులు రెవెన్యూ అధికారులకు తెలియపరిచిన కానీ నేటి వరకు ఎటువంటి సహాయ సహకారాలు అందలేదని, ఆ కుటుంబ పరిస్థితి గమనించిన చింతూరు డివిజన్ ప్రజాశక్తి రిపోర్టర్ గా పనిచేస్తున్న షాజహాన్, జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ డాక్టర్.జమాల్ ఖాన్‌కు తెలియజేయగా ఆదివారం నెల్లిపాక గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన మిర్యాల పార్వతి కుటుంబీకులకు ఇంటిని నిర్మాణ నిమిత్తం రేకులు,పైపులు ,30 వేల రూపాయల నగదు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆ కుటుంబ సభ్యులు జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ యజమానులకు రుణపడి ఉంటామని అన్నారు.

## ప్రజల అవసరాలకనుగుణంగా పనులు

**– ఎట్టకేలకు రోడ్డు పనులు ప్రారంభం**
**– రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని**



**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** ప్రజల అవసరాలకనుగుణంగా పారిశుద్ధ్య పనులు, రోడ్లు,త్రాగు నీరు,వీధి లైట్స్,తదితర పనులపై దృష్టి సారించి,పనిచేయడమే ముఖ్య కర్తవ్యంమని వరరామచంద్రాపురం, మండలం రేఖపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ పూనెం సరోజిని స్పష్టం చేశారు. ఆదివారం ఎట్టకేలకు గుంతలు పూడ్చే పనులకు శంకుస్థాపన పూజా కార్యక్రమాలు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈసందర్భంగా సర్పంచ్ పూనెం సరోజిని మాట్లాడుతూ, ఈ రోడ్డువెంట నిత్యం వాహనాలు, గొల్లగూడెం, గ్రామస్తులు,ే ంఖపల్లి, వాసులు తిరుగుతూ ఉంటారని, రోడ్డు సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, వారి ఇబ్బందులు తీర్చేందుకే ఈ రోడ్డు గుంతలు పూడ్చే కార్యక్రమం,చేపట్టామని వివరించారు.ఈ రోడ్డు పనుల పూజా కార్యక్రమంలో జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, సీనియర్ సి.పి.ఎం.పార్టీ నాయకులు పంకు సత్తిబాబు,చీరపు రాంబాబురెడ్డి, గ్రామస్తులు బేతి తిరుపతయ్య, శివగిరి రాజు, వేటకాని సూరిబాబు, నాళ్లరపు ప్రకాష్ రావు, వీర్ల నాగేశ్వరరావు, పట్టీ సీతయ్య, తదితరులు పాల్గొన్నారు.